ప్రజాశక్తి

ఆదివారం 4 ఫిబ్రవరి 2024

5

అల్లూరి సీతారామరాజు



సంతల్లో దళారులదే హవా

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని శనివారం వారపు సంతలో దళారి వ్యవస్థ హవా నడుస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజనులు అటవీ ఉత్పత్తులు, పండించిన పంటలను వారపు సంతలకు తెస్తుంటారు. రైతులు ఎంతో కష్టించి పండించిన పంటలకు సరైన ధరలకు కొనుగోలుకు చేయక పోవడంతో నష్టపోయితున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు, పిప్పలు, కాఫీ తదితర పంటలను తక్కువ ధరలకు దళారులు కొనుగోలు చేశారు. పంటలకు కనీసం పెట్టుబడి సొమ్ము కూడా రాక పోవడంతో రైతులు నిరాశ వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి పండించిన పంటలకు కనీసం రవాణా ఖర్చులకే సరి పోతుందన్నారు.



కొనుగోలు చేస్తున్న మైదాన ప్రాంత వ్యాపారులు

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

-1/ 70 చట్టానికి తూట్లు -పట్టించుకోని అధికారులు -హుకుంపేటలో ఆగని కట్టడాలు



ఇంటిపై మరో అక్రమ నిర్మాణాన్ని చేపడుతున్న గిరిజనేతరురాలు



అక్రమంగా హోటల్ నిర్మాణం చేపట్టిన గిరిజనేతరురాలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని గిరిజనేతరులు అక్రమ కట్టడాలను అధికారుల అండదండలతో చేపడుతున్నారు. 1/70 చట్టానికి గిరిజనేతరులు తూట్లు పొడుస్తున్నా పట్టించుకోలేదు. స్థానిక ప్రభుత్వ వెలుగు కార్యాలయం పక్కన గిరిజనేతరురాలు బుడ్డిగ కొండమ్మ ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టింది. గిరిజనులు, గిరిజన సంఘం, సిపిఎం నాయకులు గతంలో పోరాటం చేయడంతో ఆ ఇంటి పనులు నిలిచిపోయాయి. రెవెన్యూ సిబ్బంది అండదండలతో ఉన్న ఇంటిపై మరో గృహాన్ని ప్రస్తుతం నిర్మిస్తుంది. వెలుగు కార్యాలయ స్థలాన్ని ఆక్రమించి అరటి చెట్లను తొలగించి రహదారిని చదును చేయిస్తుంది. స్థానిక రెవిన్యూ అధికారులు ఆ ఇంటి కోసం సీసీ రోడ్డు నిర్మాణానికి కొలతలు కొలవడం చూస్తుంటే గిరిజనులకు రక్షణ కరువైందని చెప్పవచ్చు. గిరిజనేతరురాలు కొండమ్మకు మండల కేంద్రానికి రోడ్డు అనుకుని హోటల్ ఉంది. అలాగే మూడు షాపులు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఇంటిపై మరో గృహాన్ని లాడ్జి నిమిత్తం నిర్మిస్తుంది. అధికారులకు చేతివాటాన్ని ఇచ్చి పేదరాలని మాయమాటలు చెప్పుకొని ప్రభుత్వ స్థలాన్ని స్వాహా చేసి ఇల్లు కట్టడం, దీనికి స్థానిక రెవెన్యూ అధికారులు సహకరించడం విశేషం. అక్రమంగా ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఇన్ని అక్రమ నిర్మాణాలు కూడా ప్రభుత్వ స్థలాల్లోనే నిర్మించడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను ఆపాలని స్థానిక గిరిజనులు, ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు.



ఐటిడిఎ పిఒ చైతన్యకు వినతిపత్రం ఇస్తున్న ఎంపిపి లక్ష్మి, ప్రజాప్రతినిధులు, సిపిఎం నేతలు

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ఐటిడిఎ పిఒకు సిపిఎం నేతలు, ప్రజా ప్రతినిధుల వినతి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలో గతేడాది ఏడాది భారీ వర్షాలు, వరదలు కారణంగా మండల వ్యాప్తంగా రోడ్లు అధ్వానంగా మారాయని, ఏ గ్రామంలో చూసినా, గోతులు దర్శనమిస్తున్నాయని, తక్షణమే రోడ్ల నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని సిపిఎం నాయకులు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతూరు ఐటిడిఏ పిఓ కావూరి చైతన్యకు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని శనివారం విఆర్ పురం ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు ఆధ్వర్యాన వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని నెలకొని ఉన్న పలు సమస్యలను పిఓకు వివరించారు. మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ఉన్న శ్రీరామగిరి గ్రామంలో మంచి నీటి సమస్య ఉందని, నిరంతరాయంగా మంచినీరు సరపరా చేయాలని కోరారు. పైసమస్యలు పరిష్కారానికి పిఓ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో విఆర్.పురం మండలంలోని సిపిఎం సర్పంచ్‌లు పూనెం సరోజిని, వెట్టి లక్ష్మి, పులి సంతోష్ కుమార్, సవలం మారయ్య, కారం బుచ్చమ్మ, సిపిఎం నాయకులు గుండెపూడి లక్ష్మణరావు, వడ్లాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌తో తాగునీటి సౌకర్యం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: జల జీవన్ మిషన్‌తో మారుమూల గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించడం జరుగుతుందని కంద్రుమ్ పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి చెప్పారు. మండలంలోని కంద్రుమ్ పంచాయతీ లాసేరుగూడ, బైలుగూడ గ్రామాల్లో జల జీవన్ మిషన్ పథకం ద్వారా రూ 7.50 లక్షల నిధులతో మంజూరైన సోలార్ గ్రావిటీ పథకాన్ని శనివారం సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంచినీటి సౌకర్యం లేని గ్రామాల్లో సోలార్ గ్రావిటీ పథకం ద్వారా తాగునీటిని కల్పించడం జరుగుతుందని ఆయన చెప్పారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా సోలార్ గ్రావిటీ తాగునీటి పథకం నిర్మాణంలో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఎస్.ఆనంద్, వార్డు సభ్యులు పీ.లచ్చన్న, బలరాం, నాయకులు శ్రీనివాసరావు, గోపి, మోహన్, ఇంజనీర్ అసిస్టెంట్ నాని, వాలంటీర్లు కుమాన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



గ్రావిటీ పథకానికి శంకుస్థాపన చేపడుతున్న సర్పంచ్



ఫిర్యాదు ఇస్తున్న ఆన్‌లైన్ యాప్ ద్వారా మోసపోయిన యువత

ఆన్‌లైన్ యాప్ మోసంపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

టిసిఐ పేరుతో వెలసిన ఆన్‌లైన్ యాప్‌లో మండలానికి చెందిన సుమారుగా 500 మంది నిరుద్యోగ యువత ఒక్కొక్కరు రూ.5వేలు నుండి రెండు మూడు లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి భారీగా మోసపోయిన సంఘటన వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి శనివారం కొంతమంది బాధితులు మారేడుమిల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రాముకు వినతిపత్రం సమర్పించారు. తక్కువ సమయంలో సులువుగా డబ్బులు వస్తున్నాయని అత్యాశతో యువత ఆన్లైన్ యాప్‌లో భారీ పెట్టుబడులు పెట్టారు. తీరా చూస్తే ఆ యాప్‌ను మూడు రోజుల క్రితం మూసి వేయడంతో యువత లబోదిబోమంటోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశతో అప్పులు చేసి మరి ఆన్‌లైన్‌లో సొమ్ము కట్టామని, ఇప్పుడు ఆ యాప్ మూసేయడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము కట్టిన సొమ్ము వెనక్కి రాకపోతే తమకు చావులే శరణ్యమని వాపోతున్నారు.

మిడ్డేమీల్స్‌కు 3 నెలల నుండి సరుకులు ఇవ్వలేదు

ప్రజాశక్తి -సీలేరు



మాట్లాడుతున్న కుమారి

జీకే వీధి మండలంలో 12 పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన సరుకులు మూడు నెలల నుంచి అందడం లేదని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల అధ్యక్షురాలు కె.కుమారి అన్నారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సరుకులు అందకపోవడంపై పాడేరు కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు జి.దేవి తదితరులు పాల్గొన్నారు.



మొండిబోరుకు మొక్కుతున్న గిరిజనులు

తాగునీటి సమస్యపై

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి: తాగునీటి సరఫరా చేయాలని పివిటిసి గిరిజనులు మొండి బోరు వద్ద పూజలు చేస్తూ వినుత్న రీతిలో నిరసన చేపట్టారు. తాగునీటి సరఫరా చేయండి ప్రభో అంటూ వేడుకుంటున్నారు. అనంతగిరి మండలం పెద్దకోట పంచాయతీ పరిధి కొండ శిఖరు చీడీవలస గ్రామంలో శనివరం వినూత్న రీతిలో ఆదిమ జాతి పివిటీజీల గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ వైస్ సర్పంచ్ కిల్లో నాగేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు తమ పివిటిసిలకు కల్పిస్తున్నట్లు చెప్పుకుంటున్నాయని తప్పా ఆచరణలో అమలు కాలేదన్నారు. తమ గ్రామానికి తాగునీటి సమస్య పరిష్కరించేందుకు 2021 సంవత్సరంలో బోరు నిర్మించారన్నారు. కరెంటు మోటారు బిగించి తమ 25 కుటుంబాలకు ఇంటింటి పైపులైన్ కలెక్షన్ ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేయవలసినప్పటికీ నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు ఎటువంటి పనులు నేటికీ చేపట్టలేదన్నారు. దీంతో తమ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కలుషితమైన ఊట నీటిని ఆశ్రయించి రోగాల బారిన పడుతున్నామని, తక్షణమే కరెంటు మోటారు కలెక్షన్ బిగించి తాగునీటిని సరఫరా చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళలు గెమిలి చిలకమ్మ, కిల్లో, కుమారి తదితరులు పాల్గొన్నారు

గిరిజనుల హక్కులను కాలరాస్తున్న బిజెపి

- ఆ పార్టీకి వంతపాడుతున్న వైసిపి, టిడిపి, జనసేనను ఎండగట్టాలి

- ఆదివాసీలు హక్కులు, పేదల కోసం పోరాడేది ఎర్రజెండా మాత్రమే

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

గిరిజనుల హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని, ఆ పార్టీకి వంతపాడుతూ మిత్రులుగా ఉన్న రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను ప్రజలు ఎండగట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు ప్రజలకు పిలుపునిచ్చారు. గిరిజనుల హక్కుల కోసం, పేదులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిలబడేది, పోరాడేది ఒక్క ఎర్రజెండా మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. మండలంలోని చికిలింత పంచాయతీ దుర్గానగరం గ్రామంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పొత్తూరు సత్యనారాయణ అధ్యక్షతన శనివారం సిపిఎం మండల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం సామాన్యులు, పేదలు, కార్మికులపై మోయలేని భారాలు వేసి వారి నడ్డి విరుస్తుందని, కార్పొరేట్లకు కోట్ల రూపాయలు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ కూడా కార్పొరేట్ల వికాసంగానే ఉందని, రెండు నెలల్లో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో కూడా మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల వైపే మొగ్గు చూపిందంటే ఆ పార్టీ ఎంతగా ఆ వర్గాలకు సేవ చేస్తోందని అర్థమవుతుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నిరాశ మిగిలిందన్నారు. వ్యవసాయం, ఉపాధి, విద్యా రంగం, గిరిజన ప్రాంత అభివృద్ధికి బడ్జెట్లో ఒరిగిందేమీ లేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి కేంద్ర బిజెపి చేస్తున్న అన్యాయాలను ప్రశ్నించాల్సిన అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు బిజెపి పంచన చేరి దానికి వత్తాసు పలకడం దారుణమన్నారు. గిరిజనుల కోసం నిరంతరం శ్రమిస్తున్న సిపిఎంను ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఎటువంటి ప్రకటన చేయకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కొండ్ల సూరిబాబు, కుంజం జగన్నాథం, రామరాజు, బాబురావు, కె అప్పలరాజు, పాండవుల సత్యనారాయణ, ఎస్ లోవరెడ్డి, పెద్ద సంఖ్యలో పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి పోలీసుశాఖ కృషి

చింతపల్లి ఎఎస్‌పి శివ ప్రతాప్ కిశోర్

ప్రజాశక్తి -సీలేరు

గిరిజనుల అభివృద్ధికి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని చింతపల్లి అడిషనల్ ఎస్‌పి కొమ్ము శివప్రతాప్‌కిషోర్ అన్నారు. జీకే వీధి మండలం గాలికొండ పంచాయతీ మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో శుక్రవారం సంజీవని మెగా మెడికల్ క్యాంప్, వివాహ వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గాలికొండ పంచాయతీ పరిధి పుట్టకోట, పాత్రుని గుంట, గొర్లి గొంది, లేత మర్రి, సప్తగూడ, తదితర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో యువత హాజరై వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. రెడ్ క్రాస్ సంస్థ సౌజన్యంతో గిరిజనులకు హైజింగ్ కిడ్స్, దోమతెరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎఎస్‌పి మాట్లాడుతూ గాలికొండ నుంచి పుట్టకోట వరకు రహదారి మంజూరైందని, అటవీ శాఖ అనుమతులు రావాల్సి ఉందని, జిల్లా కలెక్టర్‌తో సంప్రదింపులు చేసి రహదారి నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు. పాత్రుని గుంట వరకు రహదారి సౌకర్యం లేక గిరిజనులు అనేక ఇబ్బందులకు గురయ్యే వారని, పోలీస్ శాఖ చొరవతో మోటార్ బుల్ రహదారి ఏర్పాటు చేశామని చెప్పారు. ఒకప్పుడు ప్రజలు మావోయిస్టుల మాటలు విని మోసపోయే వారిని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, గిరిజనులు చైతన్యవంతులయ్యారని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధిని పోలీస్‌శాఖ కోరుకుంటుందని, పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏ సమస్య వచ్చినా జీకే వీధి సిఐ అశోక్ కుమార్, సీలేరు ఎస్సై రామకృష్ణకు గాని, లేదంటే నేరుగా తనకు గాని తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జికె.వీధి సిఐ అశోక్ కుమార్, ఎస్సై అప్పలసూరి, సీలేరు ఎస్సై రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన యువతతో మాట్లాడుతున్న చింతపల్లి ఎఎస్‌పి శివప్రతాప్ కిశోర్



సంతలో భారీగా నిలిచిన వాహనాలు

ట్రాఫిక్ వలయంలో సంత

- భారీగా నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలోని వారపు సంతల్లో ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం వారపు సంతలో ట్రాఫిక్ సమస్యతో గంటల పాటు రహదారి స్తంభించి పోయింది. మొదకొండమ్మ గుడి నుండి కమయ్యా పేట రోడ్డు వరకు ట్రాఫిక్‌తో నిండి పోయింది. జనాలతో సంత కిక్కిరిసి పోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో, రైతులు ఇబ్బందులు పడ్డారు. నిత్యం ట్రాఫిక్ సమస్యతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గిరిజనులు, ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు.

జల విద్యుత్ కేంద్రాల సమాచారం నిక్షిప్తం చేయాలి

ప్రజాశక్తి -సీలేరు : జల విద్యుత్ కేంద్రాలకు సంబంధించిన సమాచారం నిక్షిప్తం చేయవలసిన అవసరం ఇంజనీర్లకు ఎంతైనా ఉందని ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీరు బొడ్డు శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జల విద్యుత్ కేంద్రంలో ఈఈ లక్ష్మీనారాయణ నాలుగో యూనిట్ ఆధునికీకరణ గురించి రాసిన పుస్తకాన్ని చీఫ్ ఇంజనీర్ శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్‌లో ఉన్న జలు విద్యుత్ కేంద్రాలకు యూనిట్ ఆధునికీకరణ పనులపై ఎటువంటి రికార్డులు లేవని దీనివల్ల యూనిట్లు మరమ్మతులు గురైనప్పుడు లోపాలు తెలుసుకోవటానికి కుస్తీ పట్టవలసిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే ఒకటవ యూనిట్ గతంలో మరమ్మతులు గురైనప్పుడు వాటిలో లోపాలు తెలుసుకోవడానికి నెలలు తరబడి సమయం పట్టిందని, నాలుగవ యూనిట్ మరమ్మతులకు గురైనప్పుడు ఇదే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ తరుణంలో ఈఈ లక్ష్మీనారాయణ నాలుగో యూనిట్ మరమ్మతులకు ఏ విధంగా గురైందని, దానికి సంబంధించి అణువణువునా పరిశీలన చేసి యూనిట్లో నెలకొన్న లోపాలు ఎలా అధిగమించాలో అన్న విషయంపై పుస్తకం రూపంలో ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ పుస్తకాలు భావితరాల ఇంజనీర్లకు దిక్సూచిగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ రచించిన పుస్తకాన్ని మోతుగూడెం ఓ అండ్ డామ్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ సివిల్ కేకేవి.ప్రశాంత్ కుమార్, ఈఈలు బాలకృష్ణ, శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు, సీనియర్ ఎకౌంటు ఆఫీసర్ ఇవివి.సత్యనారాయణ, ఏపీ జెన్కో కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎపి జెన్‌కో అధికారులు



మొండి గోడల మధ్యనే బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

మొండి గోడల మధ్యనే విద్యా బోధన

- విద్యార్థులకు ఇక్కట్లు - పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి -అనంతగిరి: నాడు నేడు పథకం కింద రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాల రూపు రేఖలు మార్చి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుతుంటే ఆచరణలో అమలు కాలేదు. మారుమూల గ్రామాలలో కనీసం పాఠశాల భవనాలు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థిని విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతగిరి మండలం వాలసి పంచాయతీ పరిధి ఊటగెడ్డ గ్రామంలో ప్రభుత్వం పాఠశాల భవనాన్ని మంజూరు చేసింది. పాఠశాల భవనం నిర్మాణానికి అప్పట్లోనే ట్రైబల్ వెల్ఫేర్ పథకం కింద నిధులు మంజూరు చేశారు. కనీసం రోడ్డు మార్గ సౌకర్యం లేనప్పటికీ కాంట్రాక్టు పనులు చేపట్టి గోడల దశ వరకు పాఠశాల భవనం పనులు గత పదేళ్ల క్రితం చేపట్టారు. నేటికీ పాఠశాల పనులు పూర్తి చేయకుండా నిలిపి వేయడంతో ఊటగెడ్డ పాఠశాలలో విద్యా బోధన అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు వర్షం, ఎండలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో ఇంటి గడప వద్ద, ఎండాకాలంలో మొండి గోడలో ఉన్న పాఠశాల భవనం వద్ద విద్యా బోధన అందించడం జరుగుతుందని ఉపాధ్యాయురాలు పద్మ పేర్కొన్నారు. మొండి గోడలతో నిలిచిన పాఠశాల భవన పనులు పూర్తి చేయాలని, ఇందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు పి.రామస్వామిరాజు, తదితరులు డిమాండ్ చేశారు. లేకుంటే మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయం వద్ద విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులతో ఆందోళన చేపడతామని తెలిపారు.



ప్రచారం చేపడుతున్న నాయకులు

టిడిపితో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి -పాడేరు: మండలంలోని ఇరడాపల్లి పంచాయతీలో విశాఖ ఉమ్మడి జిల్లా టిడిపి అధికార ప్రతినిధి కొట్టగుల్లి సుబ్బారావు అధ్యక్షతన శనివారం చింత గొంది, నేరేడు వలస కొత్తూరు , రాయగడలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మెగా డీఎస్సీ తీసి గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు ఇచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత 23 వేల టీచర్ పోస్టులు తీస్తానని హామీ ఇచ్చారని, నాలుగు సంవత్సరాలుగా మోసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ కాంతమ్మ. మాజీ మార్కెట్ చైర్మన్ బొర్రా విజయ రాణి, రైతు సంఘం అధ్యక్షులు కిలో భీమరాజు, మాజీ సర్పంచ్ పిన్నయ్య దొర, గొండలి మాజీ సర్పంచ్ నారాయణ, తెలుగుదేశం నాయకులు కించే సూర్యనారాయణ, కించే రమణ, టీఎన్ఎస్ఎఫ్ లీడర్ వినోద్ కిల్లో మచ్చ రాజు, కిలో బాలాజీ పాల్గొన్నారు.

హామీల అమల్లో సర్కారు విఫలం

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు విల్సన్ బాబు
మూడో రోజుకు యుటిఎఫ్ రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు: ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులోని ఐటిడిఏ కార్యాలయం ముందు యుటిఎఫ్ ఆధ్వర్యంలో శనివారం మూడవరోజు కూడా రిలే దీక్ష కొనసాగించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్ బాబు అధ్యక్షతన ఈ రిలే దీక్షలను ప్రారంభించారు. ఈ రిలే నిరసన దీక్షలో జిల్లా ఆఫీస్ బేరర్స్, ఆడిట్ కమిటీ మెంబర్లు, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విల్సన్ బాబు మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం కావడంతోనే రిలే దీక్షలు చేపట్టవలసి వచ్చిందన్నారు. ప్రభుత్వానికి ఎన్నోసార్లు ఉద్యోగ సంఘాలు వినతులు, విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిలు డిఎ, ఏరియర్లు, సరెండర్ లీవులు, పిఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, 12వ పిఆర్సి 30శాతం ఐ.ఆర్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అప్రెంటిస్ విధానాన్ని 14 సంవత్సరాల పాటు పోరాడి రద్దు చేయించుకున్నామన్నారు. మళ్లీ ఇప్పుడు ఈ ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాల తర్వాత డీఎస్సీని ప్రకటిస్తూ రెండు సంవత్సరాల పాటు గౌరవ వేతనం ఇస్తామని, అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశపెడుతుందన్నారు. ప్రభుత్వం ఈ అప్రెంటిస్ విధానాన్ని తొలగించి డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల ఆర్థిక బకాలు చెల్లించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు చిట్టిబాబు, జిల్లా సహాధ్యక్షులు చీకటి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి దేముడు, జిల్లా కార్యదర్శి జి.తేజారావు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ కె.రఘునాథ్, అడ్డతీగల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రాఘవులు, దేవీపట్నం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, చిన్ని బాబు, మారేడుమిల్లి మండల ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారెడ్డి, మండలా అధ్యక్షులు గంగరాజు, శెట్టి గంగాధర్, జి.సతీష్, సీనియర్ నాయకులు జి.ప్రసాద్, నాగ ప్రసాద్ పాల్గొన్నారు



రిలే దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న విల్సన్‌బాబు

భారత నౌకాదళ సేవలు నిరుపమానం

గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న గీతం, నేవీ ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ : దేశ రక్షణకు భారత నౌకాదళం చేస్తున్న సేవలు నిరుపమానం అని వారి కుటుంబాలకు అండగా ఉంటామని ముఖ్యంగా నౌకాదళంలో పనిచేసే వారి సేవలకు గుర్తింపుగా నామ మాత్రపు ఫీజులతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసేందుకు సహకారం అందిస్తున్నట్లు గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ పేర్కొన్నారు. భారత నౌకాదళానికి చెందిన నేవీ వెల్ఫేర్ అండ్ వెల్‌నెస్ అసోసియేషన్ (ఎన్‌డబ్ల్యుడబ్ల్యుఎ)తో శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడే నౌకాదళ కుటుంబాలకు అండగా నిలవడం బాధ్యతగా భావించి ముందుకొచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నేవీ వెల్ఫేర్ అండ్ వెల్‌నెస్ అసోసియేషన్ చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు.

గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, నేవీ వెల్ఫేర్ అండ్ వెల్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షులు కళాహరికుమార్, తూర్పు విభాగం అధ్యక్షులు సంధ్యా పెండార్కర్, నౌకాదళ విద్యా విభాగం కమాడోర్ జి.రాంబాబు అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

అవగాహన ఒప్పందంలో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైద్య కళాశాల, ఇతర విభాగాలలో నిబంధనలకు అనుగుణంగా నౌకాదళ సిబ్బంది పిల్లలకు ప్రవేశాలు కల్పిస్తారు. విశ్వవిద్యాలయంలోని విభాగాలకు రక్షణ సాంకేతిక పరిజ్ఞానంపై బోధన, పరిశోధనలకు నౌకాదళం సహకారం అందిస్తుంది. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ విజయశేఖర్, తూర్పు నౌకాదళం పర్సనల్ సర్వీసెస్ కంట్రోలర్ వైస్ ఎడ్మిరల్ గురుచరణ్‌సింగ్, ఐఎన్ఎస్ కలింగ కమాడోర్ ప్రదీప్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలు మాఫీ

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-చింతపల్లి: ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు దఫాలలో డ్వాక్రా అక్కాచెల్లెమ్మలు తీసుకున్న రుణాలు మాఫీ చేస్తానని చెప్పిన సిఎం జగన్మోహన్ రెడ్డి ఆ ప్రకారం అమలు చేశారని పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని వైయస్సార్ ఆసరా సంబరాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.34 కోట్ల రుణాలు మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. మేనిఫెస్టోను ఎలక్షన్లకే పరిమితం చేయకుండా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన నాయకుడు జగన్ అన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 98శాతం హామీలను అమలు చేశారని కొనియాడారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. ప్రతిపక్షాలు ఓర్వ లేక తప్పుడు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పోతురాజు బాలయ్య పడాల్, ఎంపీపీ కోరాబు అనూష దేవి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు దురియా పుష్పలత, వైస్ ఎంపీపీలు సాగిన వెంగళరావు, గోపి నాయక్ శారద, స్థానిక ఎంపీటీసీలు చింతాడ జయలక్ష్మి, ధారలక్ష్మి, పద్మ, పార్టీ మండల అధ్యక్షులు మోరి రవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, కోఆప్షన్ సభ్యులు షేక్ నాజర్ వలీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మత్స్యలింగం

గెలిపిస్తే జిఒ 3పై ప్రస్తావిస్తా

వైసిపి అరకు సమన్వయకర్త మత్స్యలింగం

ప్రజాశక్తి-పెదబయలు : తనను గెలిపిస్తే సిఎం జగన్ దృష్టికి జిఒ 3 విషయాన్ని తీసుకెళతానని అరకు వైస్సార్సీపీ నూతన సమన్వయ కర్త రేగం మాత్స్యలింగం తెలిపారు. శనివారం మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ, పార్టీ టికెట్ ఆశించిన వారిలో చాలామంది ఉన్నారని, ఇందులో తాను ఒకడని తెలిపారు. గతంలో ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రెండు దపాలుగా పనిచేసి ఉద్యోగులకు వివిధ పదోన్నతులు కల్పించడంలో కీలక పాత్ర పోషించానని తెలిపారు. 2018లో ఉద్యోగానికి రాజీనామా వైస్సార్సీపీ పార్టీలో చేరానన్నారు.స్థానిక జడ్పీటీసీ ఎన్నికల్లో విజయం సాధించానన్నారు.

విలేఖరుల అడిగిన ప్రశ్నకు... జిఒ 3 సుప్రీంకోర్టు కొట్టి వేసిన తరువాత రాష్ట్ర ప్రభుత్వ రివ్యూ పిటిషన్ వేసేందుకు కాలయాపన ఎందుకు చేసిందో చెప్పాలనగా తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అసెంబ్లీలో ముఖ్యమంత్రి దృష్టికి ప్రస్థావి స్తానన్నారు. రాష్ట్రం ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాదిలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వి.ఆనందరావు, సీకారి సర్పంచ్ జి.కృష్ణారావు, మాజీ జడ్పీటీసీ గంగాభవాని, మండల బూత్ కన్వీనర్ కొర్ర కనక రాజు, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు పాంగి సింహాచలం, కుడా అనంతయ్య పాల్గొన్నారు



స్వచ్ఛ సంకల్పం బోర్డు వద్దే ఉన్న చెత్తాచెదారం

స్వచ్ఛ సంకల్పం బోర్డుల వద్దే చెత్త

ప్రజాశక్తి-రంపచోడవరం : జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో రంపచోడవరం గ్రామంలో ఏర్పాటు చేసిన బోర్డుల వద్దే చెత్తా చెదారం దర్శనమిస్తుంది. మా గ్రామం జగనన్న స్వచ్ఛ సంకల్ప గ్రామం నినాదంతో రంపచోడవరం గ్రామంలో పలు చోట్ల పంచాయతీ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ బోర్డులో బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన, రోడ్డుపై చెత్త వేయడం, రోడ్డుపై ఉమ్మి వేయడం, గ్రామంలో ప్లాస్టిక్ వంటివి నిషేధం అంటూ ఆ బోర్డులపై రాశారు. కొన్ని ప్రాంతాలలో పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను పట్టించుకోకుండా ఈ బోర్డుల కిందనే చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను వేస్తుండడం గమనార్హం.

వంతెన ఏర్పాటు చేయరూ..

ప్రజాశక్తి - సీలేరు : బత్తునూరు- గడ్డిబంద మధ్య వాగుపై వంతెన ఏర్పాటు చేయాలని బత్తునూరు గ్రామస్తుడు కొర్ర సుబ్బారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బత్తునూరు-గడ్డిబంద మధ్య వాగులో నీరు ప్రవహిస్తుండడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయన్నారు. ఈ సమస్యను అనేకసార్లు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యం పాలైతే అంబులెన్స్ రాలేని పరిస్థితి నెలకొందన్నారు. గాలికొండ పంచాయితీ పాత్రునిగుంట వరకు పోలీసు శాఖ చొరవతో మోటార్ బుల్ రహదారి చేపట్టారని, వంతెన నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేయాలని చింతపల్లి ఎఎస్పి శివ ప్రతాప్ కిషోర్‌ని కోరామని, దానికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

డబ్బులు వసూలు చేసిన వారిపై క్రిమినల్ చర్యలకు వినతి

ప్రజాశక్తి- చింతూరు : ఎటపాక మండలం లక్ష్మీదేవిపేట, మెడువాయి గ్రామాల్లో గుడిసెలు వేసుకున్న ఆదివాసీల నుండి పట్టాలిప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను శనివారం చింతూరు ఐటిడిఎ పిఒకి, ఎఎస్‌పికి, ఎటపాక తహసీల్దార్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ఆదివాసీలు గుడిసెలు వేసుకున్న భూమి పట్టా భూమి అని కొందరు కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఆదేశాల మేరకు అధికారులు ఆ గుడిసెలను తొలగించారని తెలిపారు. గుడిసెలు వేసుకున్న భూమికి పట్టాలు ఇప్పిస్తామని ఒక్కో ఆదివాసీ దగ్గర రూ.10వేలు నుండి రూ.50 వేలు వరకు వసూలు చేశారని, ఈ మొత్తం సొమ్ము కోటి రూపాయలపైనే ఉంటుందని చెప్పారు. ఆ డబ్బులు ఎవరు వసూలు చేసి కాజేశారో దర్యాప్తు చేసి, ఆ డబ్బులను తిరిగి బాధిత ఆదివాసీలకు ఇప్పించాలని, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణభారతి ఆధునికీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి జోన్ 3 పరిధిలోని స్వర్ణ భారతి స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఆధునికీకరించి స్పోర్ట్స్ ఎరీనాగా అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్కడ ఉన్న టెన్నిస్ కోర్టును పూర్తిగా ఆధునికీకరించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. విశాఖ నగరంలో రానున్న రోజుల్లో జరుగబోవు అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్నారు.

'రియల్' కారణాలేనా..?

-తహశీల్దార్ రమణయ్య హత్యతో ఉలిక్కిపడ్డ విశాఖ
- రెవెన్యూ ఉద్యోగుల్లో కలవరపాటు
- నిందితున్ని కఠినంగా శిక్షించాలంటూ ఎక్కడికక్కడ నిరసనలు
- సమగ్ర దర్యాప్తు జరపాలి : సిపిఎం

ప్రజాశక్తి - మధురవాడ, ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ విలేకరులు

విశాఖలోని చినగదిలి మండల తహశీల్దారుగా పనిచేసి ఇటీవలే విజయనగరం జిల్లా బొండపల్లి మండలానికి బదిలీ అయిన సనపల రమణయ్య పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్యకు గురవడంతో విశాఖ, విజయనగరం జిల్లాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. తమ భద్రతపై రెవెన్యూ ఉద్యోగులు కలవరపాటుకు గురయ్యారు. రియల్ ఎస్టేట్, భూవివాద అంశాలే రమణయ్య హత్యకు కారణాలుగా తెలుస్తోంది. ఇదే విషయాన్ని విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మీడియా సమావేశంలో శనివారం మధ్యాహ్నం ప్రస్తావించారు.

రమణయ్య సొంత ఊరు శ్రీకాకుళం జిల్లా నందిగామ మండలం దిమ్మిలాడ గ్రామం. ఆయనకు భార్య, పాప, బాబు ఉన్నారు. పదేళ్ల క్రితం విధుల్లో చేరిన ఆయన ఉత్తరాంధ్రలోని వజ్రపుకొత్తూరు, పద్మనాభం, విశాఖ రూరల్ (చినగదిలి) మండలాల్లో తహశీల్దార్‌గా పనిచేశారు. రెండు రోజుల క్రితం విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీ అయ్యారు. తొలిరోజు విధులకు హాజరై రాత్రి 8 గంటల సమయంలో తాను నివాసం ఉంటున్న కొమ్మాదిలోని ఎస్‌టిబిఎల్ థియేటర్ వెనుక ఉన్న చరణ్ క్యాస్టల్స్ అపార్టుమెంట్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో రాత్రి 10 గంటల సమయంలో దాడి జరిగింది. ఇనుపరాడ్డుతో గుర్తు తెలియని వ్యక్తి తలపై కొట్టడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అనంతరం ఆరిలోవలోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. రమణయ్య కుటుంబీకులను ఏపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు సత్తి నాగేశ్వరరెడ్డి, తదితరులు విశాఖలోని కెజిహెచ్ వద్ద పరామర్శించారు. ప్రభుత్వ భూములకు రక్షణగా ఉన్న ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందని ఈ సందర్భంగా వారు మీడియాకు తెలిపారు. అనంతరం ఉద్యోగులంతా కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. రమణయ్య కుటుంబీకులను టిడిపి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, జనసేన నాయకులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శించారు.

ముక్కుసూటి మనిషిగా రమణయ్యకు పేరు

ముక్కు సూటి మనిషిగా, అవినీతికి దూరంగా ఉండే వ్యక్తిగా రమణయ్యకు పేరు. భూదందాలకు పెట్టిందే పేరుగా వున్న చినగదిలి మండలంతో పాటు అయన పలుచోట్ల రెవెన్యూ విభాగంలో పనిచేశారు. ఈ క్రమంలో భూ ఆక్రమణలకు సహకరించకపోవడమే ఈ హత్యకు కారణమేమోనని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



ఘటనా స్థలంలో విచారణ చేపడుతున్న పోలీసులు



హత్యకు కొద్ది గంటల ముందు విజయనగరం జిల్లా బొండపల్లి తహశీల్దారుగా బాధ్యతలు చేపడుతూ రమణయ్య

తహశీల్దార్ హత్యపై సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం

విశాఖ రూరల్ తహశీల్దార్ సనపల రమణయ్య దారుణ హత్యపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శనివారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. మండల మెజిస్ట్రేట్‌కే భద్రత లేనప్పుడు సాధారణ ప్రజానీకం పరిస్థితి చెప్పనవసరం లేదని పేర్కొన్నారు. ఇటీవల విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ కుటుంబం కిడ్నాప్‌కు గురైందని, నాడే ప్రభుత్వం కిడ్నాప్‌కు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని వుంటే నేడు ఇలాంటి ఘటనలు జరిగి ఉండేవి కావని తెలిపారు. ప్రభుత్వం ఉదాసీనంగా వుండడంతో ల్యాండ్ మాఫియా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన రాజధానిగా ప్రకటించిన ప్రాంతంలోనే శాంతిభద్రతలకు ఇలాంటి పరిస్థితులు వుంటే, రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల్లో చెప్పనక్కరలేదని పేర్కొన్నారు. తహశీలార్ రమణయ్య హత్య పట్ల అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయని, వెంటనే దోషులను అరెస్టు చేసి చట్ట ప్రకారం శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హత్య వెనుక వున్న వారందరినీ ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకూ లొంగకుండా అన్ని కోణాల నుంచీ దర్యాప్తు చేసి శిక్షించాలని నగర పోలీసు కమిషనర్‌ను కోరారు. రాజకీయ రియల్ ఎస్టేట్, భూదందా మాఫియా నుంచి విశాఖ ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు, రెవెన్యూ అధికారులకు రక్షణ కల్పించాలని కోరారు. కొన్నేళ్లుగా విశాఖలో రాజకీయ రియల్ ఎస్టేట్ మాఫియా చెలరేగిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు.

నేర రాజధానిగా విశాఖ : మాజీ మంత్రి గంటా

పారిశ్రామిక రాజధానిగా ఉన్న విశాఖపట్నం వైసిపి ప్రభుత్వం కారణంగా నేర రాజధానిగా మారిపోయిందని టిడిపి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆరోపించారు. హత్యకు గురైన తహశీల్దార్ రమణయ్య హత్య తనను కలచి వేసిందన్నారు. శనివారం రమణయ్య కుటుంబ సభ్యులను కెజిహెచ్ మార్చురీ వద్ద పరామర్శించి ఆయన ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విశాఖలో క్రైమ్ రేట్ పెరిగిపోతోందన్నారు. కార్యక్రమంలో టిడిపి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన భూ మాఫియా : జనసేన నగర అధ్యక్షులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రశాంత విశాఖ నగరంలో రియల్ ఎస్టేట్, భూ మాఫియాలు పెరిగిపోయాయని జనసేన నగర అధ్యక్షులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ఆరోపించారు. రమణయ్య మృతదేహం ఉన్న కెజిహెచ్ మార్చురీ వద్ద ఆయన కుటుంబ సభ్యులను వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శించారు.

సిపిఐ ఖండన

తహశీల్దార్ రమణయ్య హత్యను సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఖండించారు. సనపల రమణయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి

యువతను నమ్మించడానికే డిఎస్‌సి ప్రకటన

ప్రజాశక్తి- రంపచోడవరం : రానున్న ఎన్నికల్లో యువతను నమ్మించడానికే ముఖ్యమంత్రి జగన్ డిఎస్‌సి ప్రకటన చేశారని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. స్థానిక ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించింది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అని ఎద్దేవా చేశారు. 50,892 ఖాళీలుంటే, 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగుల్ని మోసం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే జగన్ కొత్త డ్రామాకు తెర తీశారన్నారు. ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పిన జగన్ నాలుగన్నరేళ్లు చేసింది ఏమీ లేదని మండిపడ్డారు. కల్తీ మద్యం అమ్మకాలతో మద్యం ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారన్నారు. గంజాయి ఉత్పత్తిలో నెంబర్ వన్‌గా ఎపి ఉందని చెప్పారు. ఆర్థిక ఉగ్రవాది జగన్ పాలనలో వనరులన్నీ దోపిడీకి గురై, అరాచకం రాజ్యమేలుతోందని ఆరోపించారు.

నేడు నాలుగు మండలాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆదివారం గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాలకు సంబంధించిన గ్రామాలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఇఇ యండి.యూసఫ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు

'బాబు ష్యూరిటీ'పై ప్రచారం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలు గురించి టిడిపి నాయకులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీలేరు గ్రామ కమిటీ అధ్యక్షుడు కే.సన్యాసిరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి కోడా సురేష్ కుమార్, తెలుగు రైతు అధ్యక్షులు కె.వెంకటప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షులు చిటికెల రాము, సీనియర్ నాయకులు ప్రదీప్, బొర్రా కృష్ణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యాన రంపచోడవరం మండలం, సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ఈ నెల 4న ఆదివారం సాధారణ వైద్య శిబిరం, వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ వారిచే కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహారాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందులు, కళ్ళ జోళ్లు అందిస్తారని, కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి పరమ హంస యోగానంద నేత్రలయానికి తరలిస్తామని చెప్పారు. కంటి ఆపరేషన్లు నిమిత్తం వచ్చు వారు తప్పని సరిగా ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు తీసుకుని రావాలని సూచించారు.

బిఎస్ఎన్ఎల్ రక్షణకు సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశ వ్యాప్తంగా నరేంద్రమోడీ అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరుగుతున్న పారిశ్రామిక సమ్మెలో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాగర్ పిలుపునిచ్చారు. శనివారం బిఎస్ఎన్ఎల్ ఆఫీస్‌లో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు.